# ఆరాధన

ఎం.రమణారెడ్డి

ఏ వయసులో తీరాల్సిన ముచ్చట ఆ వయసులో తీరాలని నూనూగు మీసాల లేత ప్రాయంలో నీ మీద మనసు పరుచుకున్నాను. నీలో అణువణువునా నన్ను ఊహించుకున్నాను. నువ్వు మనసిచ్చినట్లు నీ చూపులే చెప్పాయి. అది నిజమేనని నీ మాటలే చెప్పాయి. క్లాస్‌లో ఎవ్వరితోనూ మాట్లాడని నువ్వు నాతోనే ఎందుకు మాట్లాడావు. నువ్వు మాట్లాడిన కొన్ని జ్ఞాపకాలు.

20 ఆగస్ట్ 89న ప్రాక్టికల్స్ రూమ్‌లో "మీ నోట్స్ ఇవ్వండి. రాసుకొని ఇస్తాను" అన్నావు. ఇచ్చాను. ఆ నోట్స్‌లో ఏమని రాశావో గుర్తుందా?

హృదయాన్ని ప్రమిదగా చేసి
కనుపాపలను వత్తులుగా చేసి
కన్నీటి నూనెతో... ...
నిట్టూర్పుల వేడిలో
దీపాలు వెలిగించి...
అనుక్షణం నీ కోసం వేచి
వుండే
నీ... రమ

నా నోట్స్‌లో ఆ విధంగా రాయడంలో నీ భావాన్ని గుర్తించి, అంతర్యాన్ని గ్రహించి, నీ మనసుతో నా మనసు కలిపేశాను. అలా పరిచయం పెరిగి "ఇంతింతై వటుడింతై" అన్నట్లు ఎన్ని వేల క్షణాలు దొర్లి పోయాయో!

25 డిసెంబర్ 89వ సినిమా ప్రోగ్రాం "ఏ సినిమాకి" అంటే "నవగ్రహ పూజా మహిమ" అన్నావు.

"ప్రేమికులు అటువంటి సినిమాలకి వెళతారా?" అని నేను అంటే

"ప్రేమికులు వెళ్ళాల్సింది అటువంటి సినిమాలకే... ఎందుకంటే బోర్ కొడితే లేచి రావచ్చు లేదా బాతా ఖానీ కొట్టవచ్చు. ఎవరూ మనల్ని పట్టించుకోరు... ఏ 'లవ్' పిక్చర్‌కో వెడితే అక్కడంతా మనలాంటి జంటలే" అంటూ లెక్చర్ దంచావు.

నీ ప్రోత్సాహం వల్లనే కాలేజీలో కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొన్నాను. నీ ప్రోత్సాహం వల్ల వ్రాసిన 'సినీమాయా బజార్' నాటికలో నేను వేసిన వెరైటీ వేషానికి కాలేజీ బెస్ట్ యాక్టర్‌గా ఫస్ట్ ప్రైజ్ అందుకున్నాను. ఆ రోజు 4 మార్చి 90 ఆనందంతో నిన్ను ఎత్తుకుని గిరగిరా తిప్పిన రోజు.

నేను చదువులో క్లాస్ ఫస్ట్ రావడానికి కారణం నువ్వే. నీ ప్రేమలో కవిత్వం కూడా ఎక్కువే పుట్టుకొచ్చింది. అరవిరిసిన అధరాల ఎరుపు పగిలి, నా చెక్కిలిని ముద్దాడితే ఎంత అదృష్టమో? అని మురిశాను. పద్మాల్లాంటి నయనాల చూపులో చూపు కలిపి ఏడు జన్మలకు సరిపడా చైతన్యాన్ని నా కళ్ళలో నింపుకున్నాను. అమృతపు కలశం నా చేతికి చిక్కిందని మురిశాను. 28 ఫిబ్రవరి 91న కాలేజీకి నీ విరహంతో వ్రాసి, చేసిన మోనో యాక్షన్ 'భగ్న ప్రేమికుడికి' ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. నిన్ను ప్రేమించినపుడు ఎన్నికలలు కన్నాను. నువ్వు నా బట్టతలపై అప్పడాల కర్రతో కొడితే " నా బట్ట తలపైనా... అప్పడాల కర్రతోనా... కొట్టవే. కొట్టవే కోయిలా" అన్న వాక్యాలు అందులో చోటు చేసుకున్నందుకు అందరూ నవ్వారు. నువ్వు కూడా ఆపుకోలేక నవ్వి వుంటావు.

ఓ సంవత్సరంలో చిగురించి పూలుపూసి మరు సంవత్సరంలో రాలిపోయేది ప్రేమ కాదు. జీవితంలో దెబ్బలకు గాయాలుచిందించే రక్తం, నయనాలు కార్చే కన్నీరు ఎప్పుడో నాలో ఇంకి పోయాయి. జీవితపు పరిస్థితులకు రాజీ పడడం నేర్చుకున్నాను. నీ కోసం ఎన్ని రోజులైనా వేచి చూస్తాను. చూశావా – సమాజం ఇప్పటికే లేనిపోని కథలు కల్పించి నవ్వులపాలు చేస్తూ వుంది. నా ఆదర్శాలకి నువ్వు ప్రాణం పోయాలి! పునాది వేయాలి. నీ ఆప్యాయత, అనురాగం మళ్ళీ నీ ఒడిలో నేను అనుభవించాలి. అందుకు నీకు నా 'ఆహ్వానం' ఎల్లవేళలా వుంటుంది. నువ్వు కాదంటే...

కనుల కొలనులో
ప్రేమ కలువ
విరబూచి
నీరాకకై
వేయి కళ్ళతో...
అభిసారికై

●● రూపం దీపమే.
నవ్వు రసరమ్య చాపమే.
ఆమె స్నేహం అతడ్ని ఆర్టిస్టుని చేసింది.
ఆమె వలపు అతడ్ని కవిని కావించింది.
అతడ్ని నిలువెత్తు వసంతంగా మలచిన
ఆమె ఉన్నట్టుండి మూగవీణగా మారిందెందుకు? ●●

రావని తలచి
తెలిసి
కుచించుకుంటుంది
నిరాశలో వెలుగును ఆహ్వా
నిస్తూ..."
ఆ వెలుగైనా నాకు చీకటిగానే
వుంటుంది.
అకారణంగా నాపై కోపమేలా?!
ప్రియా!... ఓ రమా...!
ఆశల ఆమ్రేడితాలతో
అతిశయోక్తి అలంకారాలతో
నీలోని రూపకాలంకారానికి
ఆటవెలదినై, తేటగీతిని పాడు
కున్నాను.
ఉత్పల, చంపక మాలలతో
నిన్ను అలంకరించాలని ఆరాట
పడ్డాను.
కానీ... నీ హృదయం
శార్దూలమై, మత్తేభమై ఘీంక
రించితే
నీ తేనె రంగుకళ్ళ ఉపమానాల
కోపానికి 'ఆహ్వానం' అన్నివేళలా
వుంటుంది.
ద్వంద్వ సమాసంలా నవ్వర్థం
చేసుకుని
దుగాగమ సంధిలా కక్ష తీర్చు
కోకు
ఓ ఆరాధనను కోల్పోతావు

